ప్రజాశక్తి

గురువారం 3 ఆగస్టు 2023 | 8 పేజీలు





ప్రకాశం | బాపట్ల

ఈ నెల కూడా కందిపప్పు లేనట్టే.!

మంత్రి మాటిచ్చినా కార్డుదారులకు అందని సరుకు



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జూన్, జులై నెలలకు సంబంధించిన కందిపప్పును ఆగస్టులో ప్రతి కార్డుదారుడికీ అందిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వారం రోజుల కిందట అమరావతిలో మీడియాకు తెలిపారు. ఆగస్టుకు సంబంధించి కందిపప్పు సరఫరా నేటికీ సరఫరా కానే లేదు. రాయితీపై మూడు నెలల సరకు అందుతుందని కార్డుదారులు ఎదురుచూశారు. కానీ ఆగస్టు 1 నుంచి పేదలకు అందించే రేషన్ సరకుల్లో కందిపప్పు లేదని అధికారులే చెబుతున్నారు. దీంతో మంత్రి హామీ నీటి మూటగా మారింది.

కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీపై అందించే సరుకుల కోసం ఆశతో ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగులుతోంది. దీనికి తోడు ప్రభుత్వం పేదలకు అందాల్సిన సరుకుల్లో ఒక్కొక్కటిగా తగ్గిస్తోంది. రెండు నెలలుగా కందిపప్పు పంపిణీ చేయలేదు. ఈ నెలలో కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కార్డుదారులకు బియ్యం, పంచదారే పంపిణీ చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 385 ఎండీయూ వాహనాలుండగా వీటి పరిధిలో 6,55,525 బియ్యం కార్డులున్నాయి. ఆయా కుటుంబాలకు ప్రతినెలా బియ్యంతో పాటు అర కిలో పంచదార, కిలో కందిపప్పును ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. ప్రతి నెలా జిల్లాకు 656 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. రాయితీపై ప్రతి కార్డుకు రూ. 67 చొప్పున అందించేది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో దీని ధర రూ.150 వరకు ఉంది. జూన్, జులైతో పాటు ఆగస్టు నెలలోనూ సరఫరా లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ప్రభుత్వం నుంచి వస్తే పంపిణీ చేస్తాం..

అన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, గోడౌన్ డీటీ, యర్రగొండపాలెం

ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా లేదు. వస్తే పంపిణీ చేస్తాం. అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సరఫరా వచ్చింది. బియ్యంతో పాటు, పంచదార పంపిణీ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా వచ్చిన వెంటనే లబ్ధిదారులకు అందిస్తాం.

సంపూర్ణ పోషణను సద్వినియోగం చేసుకోవాలి

జాయింట్ కలెక్టర్ శ్రీధర్


పోషకాహారాన్ని అందజేస్తున్న జేసీ శ్రీధర్



6న టిడిపి అధినేత చంద్రబాబు రాక

గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించనున్న మాజీ సిఎం


గుండ్లకమ్మ ప్రాజెక్టును పరిశీలిస్తున్న బిఎన్.విజయ్‌కుమార్

ప్రజాశక్తి-మద్దిపాడు

ఈ నెల ఆరో తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మద్దిపాడు మండలం, మల్లవరం దగ్గర గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.ఎన్.విజయ్‌కుమార్ గుండ్లకమ్మ ప్రాజెక్టు దగ్గర ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మండవ జయంత్‌బాబు, రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడక స్వాములు, మర్నె క్రిష్టారావు, మర్నె రాఘవ, వరాల చౌదరి పాల్గొన్నారు.





మహిళల పోరు యాత్రను జయప్రదం చేయండి: ఐద్వా

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మహిళలపై జరిగే హింసను అరికట్టాలని, మద్యం, మత్తు పదార్థాలను రాష్ట్ర ప్రభుత్వ నిషేధించాలని, హింస నివారణకు కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో జులై 28 నుంచి ఆగస్టు 8 వరకు జరిగే రాష్ట్ర జాతాను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక భగత్‌సింగ్ కాలనీలో జాతా కరపత్రాన్ని ఐద్వా మార్కాపురం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ హింసపై మహిళల పోరు యాత్ర జాతా ఆగస్టు 5,6, తేదీలలో జిల్లాలో పర్యటిస్తుందని తెలిపారు. 5వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు గిద్దలూరులో ప్రవేశిస్తుందని, అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు మార్కాపురంలోని గడియారం స్తంభం సెంటర్‌కు చేరుతుందని అక్కడ జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే 6వ తేదీ ఉదయం 8 గంటలకు కనిగిరిలోని పామూరు బస్టాండ్ సెంటర్లో సభ జరుగుతుందని, అక్కడ నుంచి కొండేపి మండలం పెరిదేపిలో 11 గంటలకు సభ జరుగుతుందని అన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12:30 గంటలకు సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో, మూడు గంటలకు ఒంగోలులోని 60 అడుగుల రోడ్డు జంక్షన్‌లో సభ జరుగుతుందన్నారు. అక్కడ నుంచి నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో సభతో జిల్లాలో రాష్ట్ర జాతా ముగుస్తుందని తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షురా లు ఎస్‌డి షర్మిల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మార్కాపురం పట్టణ కార్యదర్శి డి శారా, కమిటీ సభ్యులు పి దేవమణి, సిహెచ్ ప్రమీల, పి ఎస్తేరమ్మ, మౌనిక, ఎం యోహానమ్మ పాల్గొన్నారు.


ఐద్వా ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర జాతా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

లోకేష్‌ను విమర్శించడం సరికాదు

ప్రజాశక్తి-దరిశి: యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ముండ్లమూరులో మాట్లాడినవన్నీ వాస్తవాలని, ఎవరిని అడిగినా ఎమ్మెల్యేను విమర్శించడంలో తప్పులేదని చెబుతారని దరిశి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ మాట్లాడినవన్నీ వాస్తవాలేనని అన్నారు. వైసిపి పార్టీ వాళ్లను అడిగినా కూడా నిజాలే చెప్తారని సర్వే చేయించుకున్నా అవే వస్తాయ న్నారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 2024లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దిగిపోవడం, ఎమ్మెల్యే ఓడిపోవడం ఖాయమని అన్నారు. నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పార్టీ మండల అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, నాయకులు ఓబుల్‌రెడ్డి, శ్రీను, నెమిలయ్య, నాగులపాటి శివకోటేశ్వరరావు, శాగం కొండారెడ్డి, సంగా తిరుపతిరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాలి వెంకటరామిరెడ్డి

పంట రుణాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: రైతుల పంట రుణాల బకాయిలను, రాష్ట్రవ్యాప్తంగా ఒక పర్యాయం రద్దు చేయాలని, రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించేలా కృషిచేసి రైతులను, కౌలు రైతులను ఆత్మహత్యల నుంచి రక్షించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం యర్రగొండపాలెంలోని రైతు సంఘం కార్యాలయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరిగిన మారణకాండకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస ప్యాకేజీ వెంటనే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోటా వెంకటరెడ్డి, నల్లబోతుల పాండు, కందుల ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దరిశి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

'జగనన్న సురక్ష' రాష్ట్రంలోనే ఒక చరిత్ర

ప్రజాశక్తి-దరిశి

జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్రంలోనే ఒక చరిత్ర అని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జులై 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని అన్నారు. దరిశి నియోజకవర్గంలో 74,890 కుటుంబాలను 79 క్యాంపుల ద్వారా 35,830 మంది దరఖాస్తు చేసుకుంటే 34,699 మందికి 98 శాతం సమస్యలు పరిష్కరించార న్నారు. దరిశి నియోజకవర్గంలో పర్యటించిన నారా లోకేష్ అవాస్తవాలు మాట్లాడారని విమర్శించారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, మండల పార్టీ కన్వీనరు వెన్నపూస వెంకటరెడ్డి మాట్లాడుతూ లోకేష్‌కు అవగాహన లేకనే ఎవరో రాసిచ్చిన స్క్రిప్టను చదివారని అన్నారు. తెలియకుండా మాట్లాడటం సరైనదని కాదని, ఎమ్మెల్యే నెలకు రూ.10 కోట్లు కంపెనీలలో జీతాలు చెల్లిస్తారని, ఆయనకు చిన్న చిన్నవి తీసుకోవాల్సిన అవసరం లేదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిశెట్టి రవీంద్ర, బెల్లం చంద్రశేఖర్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం: తహశీల్దారు

ప్రజాశక్తి-పొదిలి: తల్లిపాలు పిల్లలకు ఎంతో ఆరోగ్యకరమని తహశీల్దారు ఆశోక్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని నేతపాలెం పాఠశాలలో గర్భిణులకు అత్యధిక పోషక విలువలు ఉన్న నిత్యావసర సరుకులు ఉన్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ ఆర్ఐ కిలారి సుబ్బారావు, విఆర్ఓ మురళి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు శోభారాణి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు. పట్టణంలోని రథం రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏఎన్ఎం విజయ, మహిళా పోలీస్ సిహెచ్ నాగలక్ష్మి మాట్లాడారు. గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బి సత్యనాగమణి, ఆశా సుజాత, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

గర్భిణులకు ఇంటివద్దకే పౌష్టికాహారం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు ఇంటివద్దకే పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం చేపట్టిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మెప్మా కార్యాలయ ఆవరణంలో మార్కాపురం నియోజకవర్గంలోని మార్కాపురం, పొదిలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు టిహెచ్‌ఆర్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రసవానికి ముందు ప్రసవం తర్వాత మహిళల్లో రక్తహీనత విటమిన్ లోపం అధికంగా ఉంటుందని అన్నారు. దీనిని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. తప్పనిసరిగా గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చేతుల మీదుగా మహిళలు పౌష్టికాహార కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మునిసిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, డిడివో బివిఎస్ సాయికుమార్, డిఎల్‌పివో జి నాగేశ్వరరావు, మార్కాపురం, పొదిలి సిడిపిఒలు బి సుశీలాదేవి, పి సుధామారుతి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబానికి బాలినేని చేయూత

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం కె పల్లెపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని సునామీ కాలనీకి చెందిన కొక్కిలగడ్డ ఈశ్వర్లు కుమారుడు కొక్కిలగడ్డ నాంచార్లు అనారోగ్యంతో బాధపడు తుండగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఆయనకు సాయమందించారు. సముద్రపు వేట సమయంలో ప్రమాదవశాత్తు బోటు డొక్కులో గుద్దుకుని నాంచార్లు గాయపడి శరీర కంగా చాలా రోజుల నుంచి ఇబ్బంది పడుతు న్నాడు. ఈ విషయాన్ని కొత్తపట్నం ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి, ప్రకాశం జిల్లా వ్యవసా య సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, వైసిపి గ్రామ నాయకులు ఈ సమాచారాన్ని ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే బాలినేని అందించిన రూ.25 వేల ఆర్థిక సాయాన్ని కె పల్లెపాలెం గ్రామ వైసిపి నాయకులు, గ్రామస్తులు అయిన గొల్లపోతు రంగనాయకులు, కొక్కిలగడ్డ చిన జాలరాం, పిన్ని శ్రీను, ఓలేటి సముద్రాలు, వల్లభుని రాములు, స్థానిక సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్, కొత్తపట్నం మండల వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ కొక్కిలగడ్డ నాంచార్లు, రాసాని మీరాసాహెబ్ వాళ్ల చేతుల మీదుగా అందించారు. బాలినేని అందించిన సాయం పట్ల ఆ కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-శింగరాయకొండ: విజయవాడ రైల్వే డిఆర్ఎం, డీసీఎంలకు సింగరాయకొండ రైల్వేస్టేషన్ అభివృద్ధికి సలహాలు, సూచనలను శింగరాయకొండ అప్డేట్స్ సభ్యులు లిఖిత పూర్వకంగా బుధవారం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఏపీలో 11 రైల్వే స్టేషన్లు ఎంపికయ్యాయి. ఈ నేపథ్యంలో సింగరాయ కొండ రైల్వే స్టేషన్‌కు సంబంధించి ప్రయాణికు లు, ప్రజల నుంచి సలహాలు అడిగారు. ఈ నేపథ్యంలో స్టేషన్ అభివృద్ధికి సంబంధించి సలహాలు, సూచనలను అప్డేట్స్ సభ్యులు ఇవాళ విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర పటేల్‌కు, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి రాంబాబును కలిసి లిఖిత పూర్వకంగా అందజేశారు. వచ్చే వారంలో ప్రధానమంత్రి వర్చువల్‌గా స్టేషన్ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని, అందులో భాగంగా సింగరాయకొండ స్టేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అప్డేట్స్ సభ్యులు సాయితేజ, ముక్కు వాసు, ముక్కు నవీన్ పాల్గొన్నారు.


కోళ్లు పంపిణీ చేస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

ఎస్‌సి ఎస్‌టి ఉపప్రణాళిక ద్వారా కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-దరిశి: ఎస్‌సి ఎస్‌టి ఉపప్రణాళిక ద్వారా ఎస్‌సి ఎస్‌టిలకు కోళ్ళు పంపిణీ చేసినట్లు కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటరు దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక కెవికెలో కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించి కోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉష, మానస, రైతులు పాల్గొన్నారు.

'వెలిగొండ' నీరు కడపకు తరలించేందుకు..

నాడు వైఎస్ఆర్.. నేడు జగన్ కుట్ర

ప్రెస్‌మీట్‌లో టిడిపి ఇన్‌చార్జులు 'కందుల', ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-మార్కాపురం

'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు'తో పశ్చిమ ప్రాంత రైతాంగానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా వైసిపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలుగుదేశం పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆరోపించారు. బుధవారం సాయంత్రం మార్కాపురం జవహర్ నగర్ కాలనీలోని కందుల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టును తొలుత డాక్టర్ రాజశేఖరరెడ్డి రెండు సొరంగాల స్థానంలో ఒక్క సొరంగానికి పరిమితం చేసేందుకు కుట్ర పన్నారన్నారు. అప్పట్లో ప్రజా ఉద్యమంతో రెండో సొరంగ మార్గాన్ని సాధించుకున్నట్లు చెప్పారు. నేడు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే విధంగా ఈ ప్రాంత రైతాంగానికి అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. కడప జిల్లాకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని అందించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. వెలిగొండ మన ప్రాంతంలో నిర్మితమవుతున్నా.. ఈ ప్రాంతానికి కేవలం ఐదు టిఎంసిల నీటితో కరవుసీమ



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి, గూడూరి ఎరిక్షన్‌బాబు


రైతాంగాన్ని ఎలా ఆదుకుంటారని ప్రశ్నించారు. నిర్వాసితుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. కేవలం రెండు గ్రామాలకు ప్యాకేజీ ఇచ్చి సరిపెట్టాలని చూస్తోందన్నారు. 2006లో ఇచ్చిన తక్కువ పరిహారంతో ఈ ప్రాంత నిర్వాసితులను అన్యాయం చేశారన్నారు. ఇప్పట్లో ఆ రేటుకు సెంటు భూమి కూడా రాదన్నారు. కనీసం ప్యాకేజీతో ఆదుకోవాలనే ఆలోచన కూడా ప్రభుత్వం చేయడం లేదన్నారు. నిర్వాసిత గ్రామాల నుంచి ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరినీ ప్యాకేజీలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతానికి చెందిన మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కడప జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్నారని, కడపకు వెలిగొండ నీరు అందించి సిఎం జగన్ వద్ద మెప్పు పొందేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజలు సిఎం జగన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, ప్రజల ఆశలన్నీ వమ్ము అయ్యాయని అన్నారు. వెలిగొండ ద్వారా ఇక్కడి రైతాంగాన్ని వెన్నుపోటు పొడుస్తున్నారని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు విషయంలో పశ్చిమ ప్రాంత రైతాంగానికి జరుగుతున్న అన్యాయంపై ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు. ఉద్యమంలో అఖిలపక్ష పార్టీలను కలుపుకుని పోతామని చెప్పారు. ఈ నెల 5న ఫీడర్ కెనాల్ సందర్శన జరుగుతుందన్నారు. ఈ నెల 11 నుంచి మార్కాపురంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభం అవుతాయన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆమరణ దీక్షకు సైతం వెనుకాడేది లేదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో టిడిపి పెద్దారవీడు మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్‌పిటిసి జడ్డా రవి, మాజీ ఎంపిపి చంద్రగుంట్ల నాగేశ్వర రావు, టిడిపి నాయకులు ఇండ్లా రామకృష్ణారెడ్డి, దండా వెంకటేశ్వరరెడ్డి, గుమ్మా గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీల ప్రాధాన్యత పెరగాలి: బీసీ జేఏసీ

అధ్యక్షురాలుగా మనీషా భాస్కర్ నియామకం

ప్రజాశక్తి-టంగుటూరు

సామాజికంగా, రాజకీయంగా బీసీల పాత్ర, ప్రాధాన్యత ఇంకా పెరగాల్సిన ఆవశ్యకత ఉందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మిరియం శ్రీనివాసులు అన్నారు. 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షులుగా టంగుటూరు మండలం వల్లూరు గ్రామానికి చెందిన గొడుగు మనీషా భాస్కర్‌ను బుధవారం నియమించారు. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ మిరియం శ్రీనివాసులు చేతుల మీదుగా మనీషా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక కొత్త పార్టీల నిర్మాణం జరుగుతున్నప్పటికీ వాటిలోనూ బీసీల పాత్ర నామమాత్రంగానే ఉందని అన్నారు. జనాభా దామాషాకు అనుగుణం గా బీసీలు అభివృద్ధి సాధించడం లేదని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి కుల, జనగణన మాత్రమే పరిష్కారం అని, కానీ అది కేంద్ర ప్రభుత్వం ద్వారా జరగాల్సి ఉన్న నేపథ్యంలో



రాష్ట్ర కన్వీనర్ మిరియం శ్రీనివాసులు నుంచి నియామకపత్రం అందుకుంటున్న మనీషా భాస్కర్

అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ కుల, జనగణన కోసం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి సాధించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షు రాలు గొడుగు మనీషా భాస్కర్ మాట్లాడుతూ 139 కులాల బీసీ మహిళలు సామాజిక, రాజకీయాలతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తాననని అన్నారు. ఈ సందర్భంగా మిరియం శ్రీనివాసులుతో పాటు జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు చిరుమామిళ్ల గోపికృష్ణ తదితరులకు మనీషా భాస్కర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఒంగోలులో విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో విద్యుత్ కార్మికులకు ఇచ్చిన ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కమిటీ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం ఒంగోలు నగరంలో భారీ



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి హాజరైన విద్యుత్ కార్మికులు డిమాండ్స్‌తో కూడిన బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబూని ఆయా యూనియన్ల జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కర్నూల్ రోడ్‌లోని ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆనాటి పాదయాత్రలో ఇచ్చిన హామీల ప్రకారం విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని అన్నారు. విద్యుత్ సంస్థలే వీరికి నేరుగా జీతాలు ఇవ్వాలని, 2022 పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న జెఎల్‌ఎం గ్రేడ్-2 (ఎనర్జీ అసిస్టెంట్లు) ప్రొబేషన్ డిక్లేర్ చేసి సంస్థలో జెఎల్‌ఎంలుగా గుర్తించాలని కోరారు. ఎస్ఇ స్పందించి విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను రాష్ట్ర యాజమాన్యానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కొద్దిసేపు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ 'చలో తిరుపతి' ఎపిసిపిడిసిఎల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని నిర్ణయించారు. పవర్ జెఏసి నాయకత్వంలో జరుగుతున్న దీక్షా శిబిరంలో స్థానిక స్ట్రగుల్ కమిటీ చైర్మన్ జివి రాగయ్య మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు, ఏఐటియుసి నాయకులైన జివి కొండారెడ్డి జి శ్రీనివాసరావు, పివిఆర్ చౌదరి, ఎస్‌డి సర్దార్, స్ట్రగుల్ కమిటీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె నాగరాజు, స్ట్రగుల్ కమిటీ స్థానిక చైర్మన్ జివి రాగయ్య, ప్రధాన కార్యదర్శి కనుకుర్తి రవికుమార్‌తో పాటు పాపారావు, ఎస్ వెంకటరావు, సిహెచ్ నాగేశ్వరరావు, ఎమ్‌సిహెచ్ వీరాంజనేయులు, అఖిల్ బాషా, ఎ రవికుమార్, డి రవికుమార్, సుధాకర్, కోటేశ్వరరావు, జిల్లా నలుమూలల నుంచి కార్మికులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్రంలోనే అగ్రిగోల్డ్ బాధితులకు ఆగస్టు 15వ తేదీ లోపు రావాల్సిన రూ.3,080 కోట్ల బకాయిలను వెంటనే ఇచ్చి న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెన్సీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి తిరుపతి రావు డిమాండ్ చేశారు. బుధవారం యర్రగొండ పాలెంలోని సీపీఐ కార్యాలయంలో నియోజక వర్గ స్థాయి అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వి తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ కంపెనీ మోసం చేసి నేటికి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిందని అన్నారు. ఆ రోజు నుంచి అగ్రిగోల్డ్ అసోసియేషన్ సీపీఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు నేతృత్వంలో అనేక ఉద్యమాలు చేసిందన్నారు. ఆ ఉద్యమాలకు ఫలితంగా గత టీడీపీ ప్రభుత్వంలో చనిపోయిన అగ్రిగోల్డ్ బాధితులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆనాడు ప్రతిపక్షంలో ఉండి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించే



మాట్లాడుతున్న తిరుపతిరావు

బాధ్యత తనదేనని హామీ ఇచ్చారన్నారు. ఆగస్టు 14 ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఆగస్టు 15వ తేదీన అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయకపోతే ఆగస్టు 30వ తేదీన రాష్ట్రంలోని పది లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులతో విజయవాడలో ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి హనుమారెడ్డి, సీపీఐ నాయకులు దేవండ్ల శ్రీనివాస్, బాణాల రామయ్య, బాలిరెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ బొమ్మ వద్ద తాళాలు రిపేరు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నాగేశ్వరరావు నాయక్ అనే నిరుపేదకు అనారోగ్యంతో ఉండడంతో పూట గడవడం కష్టంగా ఉంది. విషయం తెలుసుకున్న ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు షేక్



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

ఇస్మాయిల్ తన సొసైటీ సభ్యుడైన కిసాన్ బోర్‌వెల్స్ ప్రొప్రయిటర్ షేక్ సమీవుల్లా (చోటు)కు ఈ విషయం తెలియజేశారు. స్పందించిన సమీవుల్లా దంపతులు ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్‌తో కలిసి నాగేశ్వరరావు నాయక్ ఇంటికే నేరుగా వెళ్లి బుధవారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి నాగేశ్వరరావు నాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సింగరాయకొండ

సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కిందపడి ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్‌లోనే ప్లాట్‌ఫారం నెంబర్-2లో మృతదేహాన్ని గుర్తించినట్లు చెప్పారు. అతని వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించగా మండలంలోని సోమరాజు పల్లి పంచాయతీలోని తిరుమల పట్టాభినగర్‌కు చెందిన దేవరకొండ ప్రసాద్(45)గా గుర్తించి సమాచారం అందజేశామన్నారు. ఇతను హైదరాబాదులో కొబ్బరి నూనె అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటారని, కుటుంబ సభ్యులు ఉండే తిరుమల పట్టాభి నగర్‌కు రైల్లో వస్తూ ప్రమాదవశాత్తు ప్లాట్ ఫారంపై జారిపడటంతో మృతి చెందాడని తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించినట్లు తెలిపారు.



బావిలో పడిన కుక్క.. రక్షించిన రెస్క్యూ టీం

ప్రజాశక్తి-పొదిలి: పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో భవిత పాఠశాలకు ముందు ఉన్న పాడుబడిన పాతమంచినీటి బావిలో ప్రమాద వశాత్తు జారిపడిన కుక్కను రెస్క్యూ టీం సభ్యులు బుధవారం కాపాడారు. మండల పరిషత్ ఆవరణలో పురాతన మంచినీటి బావి పూడికతో నిండిపోయి 50 అడుగుల మేర లోతు ఉంది. చుట్టు దట్టమైన చెట్లతో ఒకవైపు కొద్దిపాటి ప్రహరీతో ఉన్న ఈ బావిలో మంగళవారం ఒక కుక్క ప్రమాదవశాత్తు పడిపోయింది. సమాచారం అందుకున్న రెస్క్యూ టీం సభ్యుడు నిరంజన్ బావిలోని కుక్కను తాడు సాయంతో పైకి తీసుకువచ్చాడు. రెండు పాములను పట్టుకుని సీసాలలో బంధించి అటవీ అధికారులకు అప్పగించడం తో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూగజీవిని విషపు జంతువుల బారి నుంచి కాపాడి బావి నుంచి బయటకు తీసినందుకు నిరంజన్‌ను పలువురు అభినందించారు.

సిఐటియు మండల అధ్యక్షుడు సుబ్బరాజు మృతి

ప్రజాశక్తి-రాచర్ల



రాచర్ల మండల సిఐటియు అధ్యక్షులు, రాచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మిడ్డే మీల్స్ నిర్వాహకుడు ఏ సుబ్బరాజు(55) బుధవారం తెల్లవారుజామున కాల్వపల్లె గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గత 14 సంవత్సరాలుగా సిఐటియులో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాచర్ల పాఠశాల ఉపాధ్యాయులు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి ఆవులయ్య, గిద్దలూరు, రాచర్ల మండలాల కార్యదర్శులు డీ థామస్, బి నరసింహులు, రాచర్ల మండల కమిటీ సభ్యులు సుబ్బరాజు మృతదేహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

హ్యూమన్ రైట్స్ ఉమెన్ వింగ్

వైస్ చైర్‌పర్సన్‌గా దగ్గుమాటి అనూష

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ఒంగోలు నగరానికి చెందిన దగ్గుమాటి అనూష హ్యూమన్ రైట్స్ మహిళా విభాగం రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ ఛైర్మన్ ప్రసన్న కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమాజంలో మానవ హక్కులపై ప్రజలకు చైతన్యం కల్పించేందుకు తనవంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. అదే విధంగా హ్యూమన్ రైట్స్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి రావటానికి సహకరించినందుకు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హ్యూమన్ రైట్స్ మహిళా విభాగం రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్‌గా నియమితులైన దగ్గుమాటి అనూషను ఒంగోలు నగర ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

ఇంటి వద్దకే పోషకాహారం : మంత్రి నాగార్జున

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సంపూర్ణ పోషణ ఆహారాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున కోరారు. ఇంటివద్దకే పౌష్టికాహారం పథకంను స్థానిక మార్కెట్ యార్డులో ఆయన ప్రారంభించారు. వేమూరు నియోజకవర్గ స్థాయిలో అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిడిపిఒ గన్నవరం విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం తీసుకోలేక పోతున్నారని గమనించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇంటివద్దకే వెళ్లి అందించే విధంగా ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఐసిడిఎస్‌ను బలోపేతం చేసేందుకు సిఎం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అహర్నిశలు ప్రజా సంక్షేమం కోసం సిఎం శ్రమిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఏది అవసరమోనని ఎప్పటికప్పుడు ఆలోచిస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేసే సిఎం జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ప్రతి పక్షాలు చెప్పే అబద్ధపు మాటలు నమ్మవద్దని అన్నారు. ప్రభుత్వం చేసే పనులను వారికి వివరించి మరోమారు గెలిపించేందుకు కృషి చెయ్యాలని కోరారు. అనంతరం పలువురు గర్భిణీలు, బాలింతలకు పది రకాల పోషకాలు కలిగిన కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉప్పు శిరీషా, ఉప సర్పంచ్ బుర్లే రాంప్రసాద్, సీడీపీఒ అరుణకుమారి, ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపరవైజర్లు, నాయకులు చిన బుజ్జి, సలీమ్, చెన్నయ్య, చిన్నారి, కె శ్రీనివాసరావు, వి నాగేశ్వరరావు ఉన్నారు.


సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న మంత్రి నాగార్జున

కొల్లూరు : తోకలవానిపాలెం పంచాయతీ పరిధిలోని తురకపాలెంకు చెందిన గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను తోకలవానిపాలెం సర్పంచ్ టి కృష్ణమోహన్, అంగన్వాడి టీచర్, వార్డు నెంబర్లు, సచివాలయం సిబ్బంది చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి టి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆరోగ్య జాగ్రత్తలు ఈ వర్షాకాలంలో తీసుకోవాలని కోరారు. గర్భిణీలు, బాలింతలు బలహీనంగా ఉంటే అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. మంచి ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యం పేదలకు ఖరీదుగా ఉందని అన్నారు. అందరూ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చూపించుకోవాలని కోరారు. చిన్న పిల్లలను అంగన్వాడి సెంటర్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నెంబరు కె శ్యామల, గ్రామ పోలీస్ పి దేవీ నాగమణి, అంగన్వాడి టీచర్ కె భాగ్యమ్మ, జి శారద, సచివాలయం ఏఎన్ఎం కె జియా పాల్గొన్నారు.

రేపల్లె : మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖచే సీఎం జగన్ ప్రవేశ పెట్టిన టేక్ హోమ్ రేషన్ అనే కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే బలవర్ధకమైన పోషక బియ్యం, అను బంధ పోషకాల కిట్లను రాజ్య సభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు చేతుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ అర్హతగల వారికి టేక్ హోమ్ రేషన్ కిట్లును పంపిణీ చేస్తారని తెలిపారు. రక్త హీనత నివారణకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసిడిఎస్ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన విద్యను, పోషకాహారాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు. బాలింతలు, గర్భవతుల్లో రక్తహీనత చిన్నారుల్లో పౌష్టికాహార లోపం వంటి వాటిని నివారించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం పార్థసారథి, తహశీల్దార్ డి మల్లికార్జునరావు, పల్లపట్ల ప్రాజెక్ట్ అధికారిని ఎం అనసూయ, రేపల్లె ప్రాజెక్ట్ అధికారిని డి మాణిక్యం, సూపర్ వైజర్స్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు పోరుబాట పట్టాలి

ప్రజాశక్తి - బాపట్ల

చిన్నారులు, మహిళలపై రోజు రోజుకి పెరుగుతున్న హింస అరికట్టే వరకు మహిళలు పోరుబాట పట్టాలని ఐద్వా బాపట్ల జిల్లా నాయకురాలు టి సుభాషిణి కోరారు. సుందరయ్య భవన్‌లోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల పూర్తి నిర్లక్ష్య ధోరణితో అవలంబిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వాలు హింసను అరికట్టే వరకు పోరాటం చేయాల్సి ఉందన్నారు. మహిళా మల్లయోధులు ఢిల్లీలో చేసిన ఆందోళన తడి ఆరకముందే మణిపూర్‌లో కుకీ ఆడపడుచుల నగ్నంగా నడిపించిన ఘటన దేశాన్ని కుదిపేస్తోందని అన్నారు. ఢిల్లీలో శ్రద్ధావాకర్, బొంబాయిలో సరస్వతి వైద్యునిపై, చెరుకుపల్లిలో అమర్నాథ్ పై అతి క్రూరంగా జరిగిన హత్యలు దేశాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నాయని అన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక అఘాయిత్యం జరుగుతోందని అన్నారు. బిజెపి అధికారానికి వచ్చాక ఇవి ఇంకా పెరిగాయని అన్నారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్, సింగార్ లాంటివారు మహిళలపై లైంగిక దాడికి పాల్పడినా కేంద్ర ప్రభుత్వం వారిని రక్షించేందుకు పూనుకుందని ఆరోపించారు. పైగా బాధితులపై అసత్య ప్రచారం చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోందని అన్నారు. నిర్భయ, దిశ ప్రచారం తప్ప ప్రయోజనం లేదని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112కు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందన కరువైందన్నారు. మహిళలపై దాడులు అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 6న బాపట్లలో జరిగే పోరుయాత్రలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విస్తృతంగా ఇంటింటి ఓటర్ల సర్వే

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలో వివిధ గ్రామాలలో ఇంటింటి ఓట్ల సర్వే విస్తృతంగా చేపట్టారు. బిఎల్ఓలు, విఆర్ఓలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈ సర్వేలో పాల్గొంటున్నారు. టిడిపి, వైసిపి పార్టీలు సర్వే అధికారులతో కలిసి దగ్గరుండి మరీ పరిశీలించుకొంటున్నారు. సర్వే బృందాలను ఎప్పటికప్పుడు మండల తహసీల్దార్ డి వెంకటేశ్వరరావు పరిశీలిస్తున్నారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం దిశా నిర్దేశం చేశారు. సర్వేని వేగవంతం చెయ్యాలని, ఎక్కడా తప్పులు లేకుండా సరిచేసుకొని పూర్తి చెయ్యాలని ఆదేశించారు.

మణిపూర్ ఘటన పై కేంద్రం ద్వంద వైఖరి

ప్రజాశక్తి-భట్టిప్రోలు (వేమూరు)

మణిపూర్‌లో గిరిజనులు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం వేమూరులో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఏపి మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సా నాగరాజు మద్దతు ప్రకటించారు. మణిపూర్ ఘటన అమానుష చర్యని అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద చర్యలకు పాల్పడుతుందని అన్నారు. క్రైస్తవులు, మైనారిటీ, గిరిజనులను కాపాడేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం మండల తహసీల్దార్ ఎంఎల్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

గ్రేస్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు(వేమూరు)

వేమూరు మండలం వరహాపురం గ్రామానికి చెందిన పచ్చిగళ్ల చిన రత్తయ్య బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత క్రైతేపల్లి పాలేరాజు మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రు.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రేస్ ఫౌండేషన్ వేమూరు నియోజకవర్గంలో కుల మతాలకు అతీతంగా అన్ని రకాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు యన్నం సురేష్, అనిల్, వెన్ను, సురేష్ ఉన్నారు.

మానసిక వికలాంగులకు కిట్లు పంపిణీ

బాపట్ల : సమగ్ర శిక్ష భవిత పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యా కేంద్రంలో ఆయా విద్యార్థులకు అవసరమైన కిట్లను బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పిజెవి రామారావు పంపిణీ చేశారు. బాపట్ల పట్టణంలో అక్బర్ పేటలో ప్రత్యేక అవసరాలు విద్యా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 52 మంది పిల్లలకు టిఎల్ఎం కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త వి సత్యనారాయణ, ఎంఈఓలు నిరంజన్, ప్రసాద్, నీడ్ సంస్థ ప్రతినిధి శంకర్, జిల్లా కోఆర్డినేటర్ సాగర్ పాల్గొన్నారు.

పోస్టాఫీసుకు తాళం వేసి ఆందోళన


పోస్టాఫీసు ఎదురు ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, ఖాతాదారులు

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు మండలం పరిధిలోని క్రాప పోస్ట్ ఆఫీస్ లో గల్లంతయిన డబ్బులు వెంటనే ఖాతాదారులకు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కొల్లూరు హెడ్ పోస్ట్ ఆఫీస్ గేట్లు మూసివేసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల సిపిఎం నాయకులు బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ గతంలో తెలిపిన విధంగా క్రాప గ్రామం పోస్ట్ ఆఫీస్‌లో రూ.30లక్షలు తీసుకొన్న శరత్ అనే అతను పరారయ్యాడని తెలిపారు. ఆందోళన సందర్భంగా ఈనెల 31నాటికి ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అనుకున్న సమయానికి డబ్బులు ఇవ్వకపోవడంతో బుధవారం లబ్దిదారులు కొల్లూరు హెడ్ పోస్ట్ ఆఫీస్ తాళాలు వేసి ఆందోళన చేశారు. దీంతో ఉన్నతాధికారులు సాయంత్రం 4గంటలకు వచ్చి లబ్దిదారులతో మాట్లాడి మొత్తం 102 మంది ఉన్నారని, ఇప్పుడు 42 మందికి ఎకౌంట్లో డబ్బులు ఏడు రోజుల్లో వేస్తామని, మిగిలిన అమౌంట్ ఈనెల 20న పూర్తి అమౌంట్ ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. సమయానికి ఇవ్వకపోతే మరల హెడ్ పోస్ట్ ఆఫీస్ తాళాలు వేసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు సిపిఎం మండల కార్యదర్శి తోడేటి సురేష్ గ్రామస్తులు సాంబ కోటేశ్వరరావు రేఖ తిరుపతమ్మ ప్రశాంతి గోపి తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - చీరాల

గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కారంచేడు రోడ్డులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లా మంగళగిరికి చెందిన నాగ ఆంజనేయులు (22) తన స్నేహితులతో కలిసి చీరాల ప్రాంతంలోని బంధువుల ఇంటిలో జరుగిన శుభకార్యానికి హాజరయ్యారు. చీరాల నుండి తిరిగి మంగళగిరికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కారంచేడు మార్గంలోని చిన్న వంతెన వద్ద పర్చూరు వైపు నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఒక్కసారిగా ఢీ కొట్టింది. దీంతో ఆంజనేయులుకు తలపై బలమైన గాయం తగిలింది. మెదడు బయటికి వచ్చింది. మొఖం అంతా చిద్రమైపోయి మృతి చెందాడు. గమనించిన స్థానికులు కారంచేడు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రీనివాసరావు వివరాలు సేకరించారు. మృతుని తల్లిదండ్రులతో ఫోన్లో సంప్రదించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమై ఆ మార్గంలోని సీసీ పుటేజిని పరిశీలిస్తున్నారు.

7 నుంచి సమావేశాలు

ప్రజాశక్తి - పర్చూరు

వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు అభివృద్ధికి సేకరిస్తున్న భూమికి పరిహారంపై రైతులతో సమావేశమయ్యేందుకు జాతీయ రహదారుల సంస్థ కార్యాచరణ ప్రకటించింది. బాపట్ల జిల్లా పరిధిలో వాడరేవు నుండి చిలకలూరిపేట వరకు రోడ్డు విస్తరణకు ఈపాటికే టెండర్లు పిలిచారు. ఈ నేపథ్యంలో భూమి నష్టపోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై రైతులతో సమావేశం నిర్వహించే బాధ్యత ఆర్‌డిఒకు అప్పగించారు. బాపట్ల ఆర్‌డిఒ ఆధ్వర్యంలో ఈనెల 7న పర్చూరులోని ఉప్పుటూరు సచివాలయం వద్ద, 8న పర్చూరు 1సచివాలయం, 9న గర్నెపూడి సచివాలయం వద్ద సమావేశాలు జరుగుతాయని జాతీయ రహదారుల సంస్థ ప్రకటించింది. 3న ఈపూరుపాలెం సచివాలయం, 4న పేరాల సచివాలయం, 5న కారంచేడు సచివాలయం వద్ద విచారణ జరుతుందని తెలిపారు.

జాతీయ పతాక రూపకర్త పింగళికి నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

భరతజాతికి అస్తిత్వాన్ని, ఆత్మస్థైర్యాన్ని అందించిన పింగళి వెంకయ్య తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణమని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎన్ మదన్మోహన్ చెట్టి అన్నారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద గల పింగళి వెంకయ్య విగ్రహానికి బుధవారం పూలమాలవేసి నివాళులు అర్పించారు. పింగళి రూపొందించిన త్రివర్ణ పతాకం ఉద్యమాలకు ఊపిరిగా, సమరయోధులకు ఆయుధంగా నిలిచిందన్నారు. జాతీయస్థాయిలో తెలుగువారి గౌరవాన్ని ఇనుమడింప చేశారని అన్నారు. కార్యక్రమంలో పోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, లజపతి రాయ్, ఎవిఎ హై స్కూల్ ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేటపాలెం : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య కుటుంబీకులను ఆదుకోవాలని పలువురు వక్తలు కోరారు. వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య మనుమరాలు కనకదుర్గ భవాని ఇంటి వద్ద జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య 147వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు బట్ల మోహన్ రావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య దేశానికి చేసిన సేవ మరువలేనిదని అన్నారు. జాతీయ పతాకంతో మన దేశానికి ఎనలేని గుర్తింపు గౌరవం లభించిందని అన్నారు. తొలుత వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కనకదుర్గ భవాని, సీతారామయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. క్లబ్బు కార్యదర్శి ఎవి సురేష్, క్లబ్బు సభ్యులు పత్తి వెంకట సుబ్బారావు, పొగడ దండ రవికుమార్, డాక్టర్ కారంచేటి శివరామకృష్ణ, కొత్త వాసు, సీతారామయ్య, ఖదీర్ భాష, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాటర్ కూలింగ్ మిషన్ బహుకరణ


ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని నాగులపాలెం నాగుబడి రంగయ్య, అచ్చమ్మ బదిరుల పాఠశాలకు తేళ్ల రమేష్‌చంద్ర, పూర్ణ భవాని వివాహ దినోత్సవం సందర్భంగా వాటర్ కూలింగ్ మిషన్ అందజేశారు. ఈసందర్భంగా రమేష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్కువ సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు నాగబైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు, నాగుబడి సుబ్బారావు, పి ఉదయభాస్కర్, కాసా అశోక్, దూళిపాల సత్యనారాయణ, పి చంద్రం, కె సుబ్రమణ్యాచారి, హెచ్ఎం ఉమాదేవి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం మండల కార్యదర్శి చింతగుంట్ల ఏసు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో విఆర్ఎలకు నెలకు రూ.15,000 వేతనం ఇస్తామని, ప్రమోషన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. వయో భారం, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న, మరణించిన వారి స్థానంలో పనిచేస్తున్న బాధితుల కుటుంబ సభ్యులు ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ వారికి ప్రభుత్వం నియామక ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు విఆర్ఎల ధర్నాకు మద్దతు మాట్లాడారు. విఆర్ఎల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7, 8 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 23, 24 తేదీలలో రాష్ట్ర కేంద్రంలో దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25న జగనన్నకు చెబుతాం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో విఆర్ఎలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండల కమిటీ సభ్యులు గూడూరి గురవయ్య, పిచ్చయ్య, జ్యోతి, అచ్చయ్య, నాగూర్, జోసఫ్, యేసయ్య, నాసర్‌వలి, రాజీవ్‌రెడ్డి, రవి నారాయణ, ప్రభాకర్, సీనియర్ నాయకులు షేక్ మౌలాలి తదతరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న విఆర్ఎలు


పుస్తకాలు అందజేస్తున్న మారం వెంకారెడ్డి

పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

కీర్తిశేషులు మారం చినపేరిరెడ్డి వర్ధం సందర్భంగా ఆయన కుమారుడు, మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గాంధీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం గుంటిగంగమ్మ ఆలయం వద్ద మారంవెంకారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భవనంలో రూ.30వేలు విలువైన సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు చాట్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పి. రమేష్, వీరారెడ్డి, మాజీ ఉపసర్పంచి మారం వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పోకూరి రామకృష్ణారెడ్డి, ఆలపాటి నరసింహారావు, కోట రాములు, సురేష్‌రెడ్డి,అంజిరెడ్డి, దశరథరామిరెడ్డి, రామకృష్ణ, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

పౌష్టికాహార కిట్లు అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

గర్భిణుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. స్థానిక బూచేపల్లి కల్యాణమండపంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమ అధికారిణి పిఆర్.ఇవాంజలీన్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **తర్లుపాడు :** స్థానిక బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ కిట్లను తర్లుపాడు సర్పంచి పల్లెపోగు వరాలు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు గాలి శివ, శ్రీధర పద్మావతి, భవనం సత్య నారాయణమ్మ, పులుకూరి అచ్చమ్మ, పోలేబోయిన లలితపాల్గొన్నారు. **కొనకనమిట్ల :** మండల పరిధిలోని గొట్లగట్టు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. సర్పంచ్ పెరికె సుఖదేవ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన మనగుండం ఎంపిటిసి కోండ్రు వెంకటేశ్వర్లు, ఇఒఆర్‌డి రావూరి జనార్ధన్, విఆర్ఒ దిలీప్‌కుమార్, అంగన్ వాడీలు ఈర్ల బాలవర్ధిరాజు, వంగిపురపు కొండమ్మ, మహిళా పోలీస్ శివరంజిత, వార్డు మెంబర్ వేము రాజు పాల్గొన్నారు.

వైసిపి ప్యానల్ విజయం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని కనపర్తి ఎత్తిపోతల పథకం ప్యానల్ ఎన్నికల బుధవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైసిపి ప్యానల్ ఘన విజయం సాధించింది. మొత్తం 16 మంది డైరెక్టర్లుకు గానూ 14 మంది వైసిపి బలపరిచిన అభ్యర్థులు గెలిపొందారు. అధ్యక్షుడిగా ముప్పా చలపతి, కార్యదర్శిగా ములిపిరి నాగేశ్వరరావు, 12 మంది డైరెక్టర్లుగా ఎన్ని కయ్యారు. విజయం సాధించిన వైసిపి ప్యానల్ అభ్యర్థులను ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్ బాబు, ఎంపిపి నలమలపు అంజమ్మ కష్ణారెడ్డి అభినందించారు.

ముక్కోడి పాలెంలో అశోక్‌బాబు పర్యటన

ప్రజాశక్తి-కొండపి


గ్రామస్తులతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

కొండపి పంచాయతీ పరిధిలోని ముక్కోడి పాలెం గ్రామంలో వైసిపి నియోజక ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాఫీ విత్ గృహసారథి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి ఆర్.రాజు, నాయకులు జి.మురళి, ఆరికట్ల కోటిలింగయ్య, పోకూరి కోటయ్య, చిన్నకండ్లగుంట సర్పంచి వన్నూరు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - గిద్దలూరు

దేశంలోని మహిళల రక్షణ కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంచర్ల కోటయ్య గౌడ్ తెలిపారు. మణిపూర్‌లోని మారణ హోమాన్ని ఖండిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోటయ్య గౌడ్ మాట్లాడుతూ మణిపూర్ ఘటన దేశంలో ప్రతి ఒక్కరిని తలదించుకునేలా చేసినట్లు తెలిపారు. దారుణం జరిగినప్పటికీ మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ జోక్యం చేసుకుని మణిపూర్‌లో మారణ హోమాన్ని అరికట్టాలన్నారు. లేకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకుడు కోటిలింగాచారి, కుమ్మరి శాలివాహన సంఘం నాయకుడు అడ్డంకి మధు సూధనరావు, ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు కోటేశ్వరరావు, వాల్మీకి సంఘం నాయకుడు ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

తల్లిపాలు అమృతంతో సమానం

ప్రజాశక్తి-పామూరు

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ జి. పద్మజ తెలిపారు. పామూరు పవర్ ఆఫీస్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలోతల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ తల్లిపాలు పట్టించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు షేక్ రమిజాబీ, కొండమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

పాఠ్యాంశాల అధ్యయనం అసెస్మెంట్ పరీక్షలకు విద్యార్థులందరూ హాజరు కావాలని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎం. రమేష్ తెలిపారు. మండల పరిధిలోని పలు పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తపట్నం ప్రాథమిక పాఠశాల, హైస్కూల్, అల్లూరు ప్రాథమిక పాఠశాల , కొప్పోలులోని ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో నిర్వహిస్తున్న ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం కుమ్మరిపాలెం పాఠశాలలో నిర్వహిస్తున్నఁ నాడు నేడు పనులను,సిఆ పాఠశాలలోని ఆర్ఓ ప్లాంట్ పనితీరును పరిశీలించారు.

4న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-కొండపి

శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 4న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వైసిపి కొండపి నియోజక ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ 15 కంపెనీల ప్రతినిధులతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు డాకా పిచ్చిరెడ్డి, సిడిపిఒ పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజకవర్గ పరిధిలోని 106 మంది బాలింతలు, గర్భిణులకు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తన సొంత నిధులతో చీరలు అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. అనంతరం అశోక్‌బాబు మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు ప్రతి రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేయలేరనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ఆర్ పథకం ద్వారా పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపి సిడిపిఒ డి.మాధవిలత, టంగుటూరు సిడిపిఒ మల్లేశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

కమిషనర్ నారాయణరావు

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజాశక్తి
కథనానికి స్పందన

ఆక్రమణదారులను వదిలేసి పోరాట నాయకులపై కేసులా అనే శీర్షికతో గత నెల 30న ప్రజాశక్తి దినపత్రికలో ఓ కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ నారాయణరావు 894 సర్వేనెంలోని ఆక్రమిత వాగు భూమిని పరిశీలించి బోర్డు, మార్కింగ్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు దళారుల మాటలు నమ్మిమోస పోవద్దని తెలిపారు. అన్ని నిబంధనలు పాటించిన వెంచర్లలోనే పాట్లు కొనుగోలు చేయాలని సూచించారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'గడప గడపకూ'ను అడ్డుకోవడం సరికాదు

ఎంపిపి నలమలపు అంజమ్మ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు



మాట్లాడుతున్న ఎంపిపి అంజమ్మ

సంతనూతలపాడు నియోజకవర్గం పేర్నమిట్ట పరిధిలోని 41,42వ డివిజన్లల్లో ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్‌బాబు నిర్వహిస్తున్న గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని టిడిపి నాయకులు అడ్డుకోవడం సరికాదని ఎంపిపి నలమలపు అంజమ్మ కష్ణారెడ్డి, వైసిపి నాయకులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగానే ఎమ్మెల్యే గడప గడపకూ తిరుగుతున్నట్లు తెలిపారు. అయితే కొందరు తమ బజారుకు రావద్దని చెప్పడం సబబుగా లేదన్నారు. అదిప్రభుత్వ కార్యక్రమని తెలిపారు. టిడిపి నాయకులు దాడులు చేసి కార్పొరేటర్ల చొక్కాలు చించడం మంచి పద్ధతి కాదన్నారు . ఈ కార్యక్రమంలో లీడ్ క్యాప్ రాష్ట్ర డైరెక్టరు కంచర్ల సుధాకర్, వైసిపి నాయకులు పోలినేని కోటేశ్వరరావు, సిహెచ్. రమేష్ ,ఇస్తర్ల అంజయ్య, కాట్రగడ్డ శ్రీనివాసరావు, చిన్నం సురేష్ ,గండు హరిబాబు, మద్దిసాని నాగేశ్వరరావు, బి.కొండయ్య పాల్గొన్నారు.

20వ డివిజన్‌లో రహదారి వివాదం

- ఘటనా స్థలాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి ఒంగోలు -సబర్బన్



అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల

స్థానిక 20వ డివిజన్ ధారావారితోటలో బుధవారం వివాదం చోటుచేసుకుంది. నగరపాలక సంస్థ అధికారులు కొత్తగా రోడ్డు ఏర్పాటు చేసేందుకు అక్కడ కొన్ని నిర్మాణాలను తొలగించాలని చెప్పారు. దాన్ని స్థానికులు వ్యతిరేకించారు. అధికారులు ఎలాగైనా రోడ్డు వేస్తామని చెప్పడంతో వారు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ధారా వారి తోటలో ప్రజలు దాదాపు 20 ఏళ్లగా నివాసం ఉంటున్నారని ,అక్కడ పట్టాల విషయం కోర్టులో కూడా ఉందని అధికారులు దష్టికి జనార్ధన్ తీసుకువెళ్లారు. వారికి కొద్దిరోజులు సమయం ఇవ్వాలని అధికారులను కోరారు. దీంతో అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ నివాసితులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలన్నారు. జనార్ధన్ వెంట టిడిపి నాయకులు హరిబాబు ,జూటూరి కష్ణ, కొఠారి నాగేశ్వరరావు, కేశన శేషమ్మ, తన్నీరు వాసు, పి.వెంకటేశ్వర రెడ్డి తదితరులు ఉన్నారు.

'సురక్ష'లో 57,404 విజ్ఞప్తులు పరిష్కారం

మేయర్ గంగాడ, కమిషనర్ వెంకటేశ్వరరావు వెల్లడి

ఒంగోలు సబర్బన్ : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నగర పరిధిలోని 70 సచివాలయాల పరిధిలో 57,404 విజ్ఞప్తులను పరిష్క రించినట్లు మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 70 సచివాలయాల పరిధిలో వివిధ రకాల సేవల కోసం 58,226 విజ్ఞప్తులు వచ్చినట్లు తెలిపారు. అందులో 57,404 విజ్ఞప్తులు పరిష్కరించామని పేర్కొన్నారు. నగరంలోని 84,733 ఇళ్లకు గానూ 74,144 ఇళ్లను 1,334 మంది వాలంటీర్ల ద్వారా సర్వే చేసినట్లు తెలిపారు. సురక్ష పథకంలో భాగంగా ప్రతి సోమ, బుధ, శుక్ర వారాలలో సచివాలయాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్‌కు సంబంధించి 29,493, ఇన్‌కం సర్టిఫికెట్లకు 25,951 విజ్ఞప్తులు వచ్చినట్లు తెలిపారు. ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ అనుసంధానికి 900 అర్జీలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు కోసం 53, కొత్త రైస్ కార్డులకు 91, రైస్ కార్డులో కొత్త సభ్యులను చేర్చేందుకు 193 అర్జీలు, రైస్ కార్డు బదిలీ కోసం 39, సిసిఆర్‌సికి 14 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి ఉండటం, మరి కొంతమంది పొరుగు ఊరికి వెళ్లడం, కొంతమంది చనిపోవడం వల్ల సర్వే మొత్తం పూర్తి కాలేదని చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధికోసం 5,904 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈనెల 15లోపు ఆ అర్జీలను పరిశీలించి అర్హత ఉన్నవారిని గుర్తించి వారికీ ప్రయోజనం కలిగేలా చూస్తామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనేది జగనన్న సురక్ష పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఒడా చైర్మన్

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న శింగరాజు మీనా కుమారి

ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ (ఒడా) ఆధ్వర్యంలో నగరంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు -1 వద్ద రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి బుధవారం పరిశీలించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు చుట్టూ రెండున్నర కిలో మీటర్ల మేర చేపట్టిన వాకింగ్ ట్రాక్ విస్తరణ పనులు, ట్యాంకు చుట్టూ కొబ్బరి చెట్లు ఏర్పాటు, కట్ట కింద నిర్మిస్తున్న ఓపెన్ జిమ్, పార్కు, యోగా ప్లాట్ ఫాం పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల పురోగతి గురించి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎప్పటికప్పుడు వివరాలు అడిగితెలుసుకుంటున్నారని తెలిపారు. నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. వాకర్స్‌కు సంబంధించి అన్నీ రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా పనులు నిర్వహిస్తామని చెప్పారు.

6న రైల్వే స్టేషన్‌లో బహిరంగ సభ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ రైల్వేస్టేషన్ అమత్ భారత పథకంలో ఎంపికైందని, అందులో భాగంగా ఈనెల 6న రైల్వేస్టేషన్‌లో బహిరంగ నిర్వ హిస్తున్నట్లు విజయవాడ అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ శరత్ చంద్ర తెలిపారు. ఒంగోలు, శింగ రాయకొండ రైల్వేస్టేషన్ల బుధవరం పరిశీలి ంచారు. ఈ సందర్భంగా శరత్ చంద్ర మాట్లాడుతూ బహిరంగ సందర్భంగా ఢిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్లలో అభివద్ధిలో భాగంగా విజయవాడ డివిజన్ పరిధిలోని 11 రైల్వేస్టేషన్ల అమత్ భారత్ పథకం ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. అందులో ఒంగోలు, శింగరాయకొండ రైల్వేస్టేషన్లు ఉన్నట్లు తెలిపారు. కొండపి, కందుకూరు, కనిగిరి నియోజకవర్గాల ప్రజలు శింగరాయకొండ రైల్వేస్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్తున్నట్లు తెలిపారు. ఆదాయంలో కూడా ముందు ఉందన్నారు. అందులో భాగంగా అమత్ భారత్ పథకంలో శింగరాయ కొండ రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేసి అభివద్ధి చేయనున్నట్లు తెలిపారు. బహిరంగ సభలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రైల్వేస్టేషన్ అభివృద్ధికి సూచనలు, సలహాలు చేయాలన్నారు. ఈ కార్యక్ మంలో రైల్వే అధికారులు పాల్గొన్నారు.

జెవివి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

జన విజ్ఞాన వేదిక మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల గౌర వాధ్యక్షుడిగా కమ్మ వెంకట నారాయణ (చిన్న పండు), అధ్యక్షుడిగా బొటుకు యల్లరావు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల గాలెయ్య, కోశాధికారిగా సిహెచ్. కష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక మార్కాపురం డివిజన్ కార్యదర్శి ఏనుగుల రవికుమార్ మాటా ్లడుతూ ఈనెల 12, 13 తేదీల్లో కనిగిరిలో నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలన జయప్రదం చేయాలన్నారు.

తల్లిదండ్రులకు బాలుడు అప్పగింత

ప్రజాశక్తి-పిసిపల్లి

ప్రమాద వశాత్తు బావిలో పడిపోయిన మతిస్థిమితం లేని బాలుడిని పోలీసులు కాపాడి తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన పిసిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... గుంటూరు జిల్లా మంగళగిరిలోని గ్రంథాలయం పేట చెందిన చలంచర్ల యేసురాజు అనే బాలుడికి మతిస్థిమితం లేదు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం యేసురాజు తప్పిపోయాడు. గత 31న రాత్రి సమయంలో పిసిపల్లి మండలం లోని గోపవరపుపల్లి చేరుకున్నాడు. రాత్రి సమయంలో ప్రమాద వశాత్తు నేల బావిలో పడిపోయాడు. బావిలోని పైపు పట్టుకొని పెద్దపెద్దగా కేకలు వేశారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు ఎస్ఐ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎస్ఐ బాలుడిని బావి నుంచి బయట తీయించి కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించారు. బాలుడి తల్లిదండ్రులు దుర్గారావు, కామాక్షిని బుధవారం పిలిపించి యేసురాజును వారికి అప్పగించారు. బాలుడి ప్రాణాలు కాపాడి తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్ఐ నాగేశ్వరరావును సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు శీలం సుదర్శనం, వైసిపి యూత్ నాయకులు మేకల మాల్యాద్రి, గ్రామస్తులు అభినందించారు.

ప్రజాశక్తి 7
గురువారం 3 ఆగష్టు 2023

పౌష్టికాహార కిట్లు పంపిణీ


పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న ఆమంచి కృష్ణమోహన్

ప్రజాశక్తి - పర్చూరు

పిల్లలు బలంగా ఉంటే దేశం పటిష్టంగా ఉంటుందని పర్చూరు వైసీపీ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. పటిష్టమైన, ఆరోగ్య వంతమైన బాలురు, బాలికలను అందిస్తున్న శిశు సంక్షేమశాఖకు ఆయన అభినందనలు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ రేషన్ పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ పథకం అత్యంత వినూత్నమైన పథకమన్నారు. పది రకాల నాణ్యమైన వస్తువులు అందిస్తున్న ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాణ్యమైన బియ్యం, వంటనూనె, రాగిపిండి, వేరుశనగ చిక్కి, అటుకులు, గుడ్లు, పాలు, కందిపప్పు, బెల్లం, ఖార్జురం తదితర పౌష్టికాహార వస్తువులతో కూడిన కిట్లను అందించారు. గర్భిణీ స్త్రీలను చీర, జాకెట్, గాజులతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పర్చూరు సీడీపీవో శుభద్ర, ఇంకొల్లు సీడీపీవో ఝాన్సీ, నాయకులు తోకల కృష్ణమోహన్, కథారి అప్పారావు, మల్లా శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, ముప్పాళ్ల రాఘవ, లంకా శివ, జంగా అనిల్, తులసి నాగమణి, ఆకుల హేమంత్, గాదె సురేష్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ఉపయోగించుకొని పుష్టికరమైన ఆహారాన్ని పొందాలని, మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని పంగులూరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శివచెన్నయ్య కోరారు. మండలంలోని ముప్పవరంలోని అంగన్వాడీ కేంద్రంలో వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణీలు, బాలింతలకు టిహెచ్‌ఆర్‌ను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి రౌతు సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో వ్యయ ప్రయాసలు కోర్చి ఈ పథకాన్ని నడుపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గంగాధర్, ఏఎన్ఎం శేషు కుమారి, సూపర్వైజర్ పద్మజా, అంగన్వాడీలు శ్రీలక్ష్మి, ప్రసన్న లక్ష్మి, సుధారాణి, శ్యామల, మహిళా పోలీస్ అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం : గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్ బాబు, జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, తహశీల్దార్ నెహ్రూ బాబు పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ అనసూయ, ఈవోపీఆర్డీ సునీత, వైస్ ఎంపీపీ తోటకూర సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి అజయ్ కుమార్, సూపర్వైజర్లు జ్యోతి, ప్రసున్న, అంగన్వాడి కార్యకర్తలు సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

చీరాల : పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వైయస్సార్ సంపూర్ణ పౌష్టికాహార కిట్లను గర్భిణీ స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరు వాసు అన్నారు. కొత్తపేట పంచాయతీ పరిధిలోని గోపాల్ నగర్ అంగనవాడి సెంటర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్యామల, హెల్త్ బాగ్ అధికారి అనుపమ, మహిళా పోలీస్ సుజాత, అంగనవాడి కార్యకర్త నిర్మల, లక్ష్మి పాల్గొన్నారు.

మేదరమెట్ల : వైయస్సార్ పోషణ సంపూర్ణ పోషణ టేక్ హెూమ్ రేషన్ బుధవారం కొరిశపాడు జగజీవన్ కాలనీ ఎంపీపీఎస్ స్కూల్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, ఏపిఎం బి అనురాధ, ఎంపీడీవో డి సురేష్ బాబు, తహశీల్దారు సుశీల, వైసిపి మండల కన్వీనర్ సాదినేని మస్తాన్రావు, సూపర్వైజర్ కె ఇందిరా, పంచాయతీ కార్యదర్శి డికె కోటేశ్వరి, హెల్త్ స్టాప్, అంగనవాడి కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీ మహిళలు, ఆయాలు, పాల్గొన్నారు.

వేడుకగా తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పర్చూరు ఐసిడిఎస్ సిడిపిఓ గాదె సుభద్ర ఆదేశాల మేరకు మండలంలో తల్లిపాల వారోత్సావాలు బుధవారం వేడుకగా నిర్వహించారు. నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని అంగనవాడీ కార్యకర్తలు గర్భిణీలు, బాలింతలకు అవాగాహన కల్పించారు. మార్టూరు తండాలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి బాణావత్ శాంతి భాయి, వైసిపి నాయకులు బాబునాయక్, మోషే నాయక్, అంగన్ వాడి కార్యకర్తలు ఎన్ రాజేశ్వరి, నాగ పుష్ప రాణి, శైలజ, సునీత, కమలమ్మ, మహిళా పోలీస్ సుకన్య పాల్గొన్నారు. కిషోర్ కాలనిలో పల్లెపోగు శ్యామల, రేపురి శాంతకుమారి, తమ్ములూరి భాగ్యమ్మ, కుందా రాణి, ఎస్తేర్, కోటమ్మ, మహిళా పోలీస్ హరిత మల్లేశ్వరి సౌజన్య పాల్గొన్నారు. వలపర్లలో ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎండ్లూరి రేచల్ జయ కటాక్షం, పాఠశాల హెచ్ఎం టి నాగసుధ, కల్యాణి పాల్గొన్నారు.

5న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జవహర్ విజ్ఞాన కేంద్రం (జేకెసి) ఆధ్వర్యంలో ఈ నెల 5న శనివారం నాడు ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రమణమ్మ తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టీంమెంబర్ ఉద్యోగాల కోసం ఈ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. 18 నుంచి 20 సంవత్సరాలలోపు ఇంటర్ (ఎంపీసీ, బైపీసీ) చదివిన మహిళలు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల స్త్రీలు తమ పదోతరగతి, ఇంటర్ ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్, పాస్‌ఫోటోలతో హాజరవ్వాలన్నారు. అర్హతలు ఉన్న మహిళా అభ్యర్థులు ప్రాంగణ ఎంపికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరాలకు కళాశాలలోని జెకెసి సెంటర్ నందుకానీ, 87540 48632, 86392 02927 నంబర్లలో సంప్రదించాలన్నారు.

డ్రైనేజి కాలువపై నిర్మాణాలు తొలగింపు


కాలువలపై ఆక్రమణలు తొలగిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చీరాల

పేరాల 5వ వార్డులో డ్రైనేజీ కాలువలు పారుదల లేక దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆ ప్రాంతవాసుల సమస్యపై ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో "మురుగు పారదు కంపు పోదు" అనే శీర్షికతో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి ఆదేశాల మేరకు ఆ ప్రాంతంలో సచివాలయ సిబ్బంది డ్రైనేజీ కాలువలపై ఉన్న అక్రమ కట్టడాలను గుర్తించి తొలగించారు. డ్రైనేజీ కాలువ పారుదలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చేసి స్థానిక ప్రజల సమస్యను పరిష్కరించారు. డ్రైనేజీ కాలవలపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. కాలువలు ఆక్రమిస్తే చెత్తాచెదారంతో మురికి నీరు నిలబడి దుర్వాసన వస్తుందని ప్రజలకు అవగాహన కల్పించారు. తొలగించిన నిర్మాణాలను తిరిగి నిర్మించినట్లయితే మున్సిపల్ అధికారులు తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని చెప్పారు. పట్టణ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. కాలవలపై నిర్మాణాలు చేపట్టవద్దని అవార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి ప్రజలను కోరారు.


మహిళా శక్తి కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంఎల్ఏ గొట్టిపాటి రవికుమార్

కార్యకర్తలందరికీ అభినందనలు

ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి

యువ గళం పాదయాత్ర ఘనంగా విజయవంతం చేసిన మహిళలోకం, పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందు ఉండి నడిపించిన సేవలు ఎప్పటికీ మరువ లేమని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి టిడిపి సీనియర్ నాయకులు నాగినేని రామకృష్ణ అధ్యక్షత వహించారు. యువ గళం పాదయాత్ర కని విని రీతిలో జరగడానికి నియోజకవర్గ ప్రజలే 99శాతం కష్ట ఫలితం అన్నారు. నేను చేసింది ఒక్క శాతమేనన్నారు. మహిళలు చేసిన కృషిని మరువలేనిదని అన్నారు. జిల్లాలో దాదాపు 220కిలోమీటర్ల పాదయాత్ర, దాదాపు ఏడు సభలు ఒకదానిని మించి మరొకటి జరిగిందన్నారు. గుండ్లకమ్మపై నిర్మించిన ప్రాజెక్ట్ నీటి ప్రవాహానికి గేట్లు కొట్టుకుపోయి 15నెలలు కావస్తున్న ఇంతవరకు గేట్లు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. టిడిపి ప్రభుత్వంలో పోలవరం 71శాతం పనులు పూర్తి చేసినప్పటికీ మిగిలిన పనులు ఇంతవరకు పూర్తి చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. చంద్రబాబు భవిష్యత్తు గ్యారెంటీ, మహిళా లోకానికి మహా శక్తి పేరిట అనేక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఈ పాటికే మహాశక్తి పేరిట కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. నియోజకవర్గంలో దాదాపు 40 గ్రామాలలో మహిళలు ప్రతి గ్రామానికి వెళ్లి మహాశక్తి పథకంపై పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. దీనిని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రవికుమార్ సూచించారు. అనంతరం మహిళా శక్తి కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అద్దంకి, జె పంగులూరు, సంతమాగులూరు, కొరిశపాడు, బల్లికురువ మండలాల పార్టీ మండల అధ్యక్షులు, టిడిపి పట్టణ అధ్యక్షులు, వార్డ్ కౌన్సిలర్లు, బాపట్ల జిల్లా టిడిపి అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా పద్మభాస్కర్ ఫౌండేషన్


ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి - చీరాల

పద్మ భాస్కర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో అన్నివేళలా ముందుండి ఆపదలో ఉన్న వారి అవసరాలను గుర్తించి వారికి చేయూతను అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ కుమార్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మరియమ్మపేటలో వనమ జయ కుమార్ పర్యవేక్షణలో 18మంది పేద వృద్ధులకు బుధవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ కుమార్ మాట్లాడుతూ గత 8సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పద్మ భాస్కర్ ఫౌండేషన్‌ను స్థాపించి పూర్తి స్థాయిలో మరిన్ని కార్యక్రమాలు చేస్తూన్నామని అన్నారు. తన తల్లి ఘంటా పద్మావతి జ్ఞాపకార్థంగా వృద్ధులకు ఆర్థిక సాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మరియమ్మపేట పెద్దలు గట్టుపల్లి శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌కి విరాళం

ప్రజాశక్తి - రేపల్లె

యూఎస్ఏలో స్థిరపడిన ప్రముఖ వైద్యులు డాక్టర్ దేవభక్తుని రమాదేవి వారి భర్త డాక్టర్ దేవభక్తుని బాబా ఈశ్వరదత్తు జ్ఞాపకార్థం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ యంత్ర సామాగ్రి నిమిత్తం రూ.3లక్షల ఆర్థిక సహాయాన్ని రెడ్ క్రాస్ బాపట్ల జిల్లా వైస్ ఛైర్మన్ వసంత వీరరాఘవయ్య అందజేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో నాణ్యత ప్రమాణాలతో నడుస్తున్న బ్లడ్ బ్యాంక్ ఎక్విప్మెంట్, రిఫ్రజిరేటర్, ఎయిర్ కండిషనర్ కొనుగోలు నిమిత్తం విరాళం అందజేశారు. ఇందుకు సహకరించిన ఎస్‌విఆర్ఎం కాలేజీ నగరం సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి, రెడ్ క్రాస్ కోశాధికారి ఏ ప్రభాకరరావు పాల్గొన్నారు. బ్లడ్ బ్యాంకుకు స్వచ్ఛందంగా విరాళాన్ని అందజేసిన డాక్టర్ రమాదేవిని రాజ్యసభ సభ్యులు మోపిదేవి రమణారావు, శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, రెడ్ క్రాస్ ప్రెసిడెంట్, రేపల్లె తాసిల్దార్ డి మల్లికార్జునరావు అభినందించారు.


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న పాస్టర్స్ అసోసియేషన్

మణిపూర్ ఘటనలపై నిరసన

ప్రజాశక్తి - కొల్లూరు

మణిపూర్‌లో క్రైస్తవులపైన, చర్చిలపైన జరిగిన సంఘటనకు నిరసనగా సమైక్య పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో పాస్టర్ యోహాను మాట్లాడుతూ భారతదేశం లౌకిక దేశమని అన్నారు. మణిపూర్ దారుణ ఘటనలపై ప్రధాని మోడీ ఇంత వరకు మాట్లాడకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు కూడా ఎలాంటి ప్రకటన చేయి పోవడం బాధాకరమని అన్నారు. శాంతి ర్యాలికీ సిపిఎం మండల కార్యదర్శి తోడేటి సురేష్ సంఘీబావం ప్రకటించారు. కొల్లూరు బస్టాండ్ సెంటర్ నుండి జగనన్న కాలనీల వరకు ర్యాలి నిర్వహించారు.

ఉద్యోగుల వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- సంతమాగులూరు

రెండు నెలలుగా రావలసిన ఉపాధ్యాయ, ఉద్యోగుల జీతాలు వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ శేఖర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలు, ప్రమోషన్లలో నూతన పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులకు 2నెలలు గడచినా కూడ నేటి వరకు జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాడర్ స్ట్రెంత్ తయారులో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉద్యోగులకు రావలసిన పిఎఫ్, ఏపీ జిఎల్ఐ, సరెండర్ లీవ్‌ల బకాయిలను వెంటనే మంజూరు చేయాలన్నారు. సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ ప్రవేశపెట్టాలని కోరారు. పిఆర్సి బకాయిలు, డిఏ బకాయిలు చెల్లించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల 5న మండల, 12న జిల్లా స్థాయిలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏపిటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వి వెలుగొండారెడ్డి, టి రామాంజనేయులు కోరారు.

నేడు పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయము నందు నేడు టేక్ హెూమ్ రేషన్ కార్యక్రమం జరుగుతుందని సిడిపిఓ డి సుధా తెలిపారు. వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు రాష్ట్ర శాప్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గం ఇంచార్జి బాచిన కృష్ణ చైతన్య చేతుల మీదుగా కిట్‌లను అందజేస్తారని తెలిపారు. అన్ని శాఖల మండల అధికారులు హాజరు కావాలని కోరారు.



సంపూర్ణ పోషణను సద్వినియోగం చేసుకోవాలి

జాయింట్ కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సిహెచ్.శ్రీధర్ చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పం దన హాలులో వై.ఎస్.ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా జేసీతో పాటు ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత గర్భిణులు, బాలింతలకు వై.ఎస్.ఆర్ సంపూర్ణ పోషకాహరాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా పేదలందరి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతో ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మిశివజ్యోతి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, పౌర సరఫరాల శాఖ డి.ఎస్.ఓ విలియమ్స్, డి.ఎం శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ సి.డి.పి.ఓలు, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.









